Kinige

స్మార్ట్ స్టోరీ కాంపిటిషన్

2013

7

# ప్రేమ చినుకు

వినోద్ కుమార్



**కథ:** ప్రేమ చినుకు

**రచన:** వినోద్ కుమార్

*కినిగె పత్రిక 2013లో నిర్వహించిన స్మార్ట్ స్టోరీ కాంపిటీషన్ లో ప్రోత్సాహక*
శా
*బహుమతి (7వ స్థానంలో) ఎంపికైన కథ ఇది. 28 యేళ్ల వయసు లోపు వారు, 750*
శ్వ
త*పదాల లోపు కథ రాయాలన్నది పోటీ నియమం.*

లింకు : http://patrika.kinige.com/?p=4230

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# ప్రేమ చినుకు

నిశ్శబ్ధ చప్పుళ్ళు వినిపిస్తూ పిల్లకాలువ పరవళ్ళు తొక్కుతోంది. మూగ సైగలు చేస్తూ పక్షులు కిలకిలల్ని మానేస్తున్నాయి. పరుగుల్ని నడకలుగా మలుస్తూ పైరగాలులు వీస్తున్నాయి. భానుడు దిక్కులు మారుతున్నా చెట్టు నీడ మాత్రం నిద్రిస్తున్న ఆ ప్రేమికుడిపై నుండి జరగడంలేదు. అతడు కలలు గంటున్నంతసేపూ పరిసరాలు స్తంభించి నిద్రకు ఉపక్రమించాయి. అతనికి లాగానే. నిశ్శబ్ధతాండవం చేస్తున్న వాతావరణం ఎంతో స్వచ్ఛంగా ఉంది. అతని ప్రేమకు లాగానే. ప్రేమికుడి హృదయం ఎలా అర్థమయ్యిందో ఏమో ఆ ప్రకృతికి, బాధతో సేదతీరుతున్న అతనికి సహకరిస్తోంది. అతను మాత్రం ప్రేయసి తలపుల్లో విహరిస్తూ ఉన్నాడు.

మేఘం మేఘాన్ని మోహిస్తే పుట్టిన చినుకొకటి ప్యారాచుట్ లేకుండా నేలపైకి దూసుకెళ్ళింది. ఎన్ని గాలులు గమ్యాన్ని మార్చడానికి ప్రయత్నించాయో! ఎన్ని పక్షులు రెక్కల్ని అడ్డుపెట్టాయో! ఎన్ని పచ్చటాకులు పందిరిగా మారాయో! ఆ చినుకు దేన్నీ లెక్కచేయలేదు.

వేగంగా ఆ ప్రేమికుడి కనురెప్పపై వాలింది.

అతని తలపులు భగ్నమయ్యాయి.

అంతే! అక్కడ నిశ్శబ్ధం ఒక్కసారిగా బద్దలైంది.

“ఎక్కడి చినుకువే నువు? నా కునుకును కడతేర్చావు. ప్రేయసెటూ దూరమైంది. కనీసం తన జ్ఞాపకాలతోనైనా సేద తీరుదామని కనులు మూస్తే, ఆ భాగ్యమూ దక్కకుండా చేశావు. మండుటెండకు ఆవిరైపోతావు పో” అంటూ రెప్పలపై కూలబడ్డ ఆ చినుకును కింద పడి ఉన్న ఆకుపై అమాంతం విసిరేశాడు.

“ప్రేమికా! ప్రేమికా!” అంటున్న చినుకు పిలుపులు అతనికి వినిపించలేదు. అతని పెదాలనుండి ఒక్కమాటా రావడంలేదు. కళ్ళవెంబడి మాత్రం నీళ్ళు జలజలా రాలుతున్నాయి. అతని మౌనాన్ని ఆ చినుకు భరించలేకుంది.

“నేల దిగే ఉత్సాహంలో మత్తుగా జారిపడ్డానే తప్పు, ఇలా నీ కలల్ని చిత్తు చేస్తాననుకోలేదు. కరుణజూపి శాపాన్ని వెనక్కితీసుకో “ అంటూ ప్రాధేయపడింది.

"పిచ్చి చినుకా! నేనేదో ఆవేశంలో ఆవిరైపోతావని అంటే దాన్ని శాపం అనుకున్నావా? మంచుకొండవైన నీవు నేల చేరేలోపు నీరయ్యావు, ఎండపడితే ఆవిరవుతావు. అసలు పుట్టుకతోనే నువ్వు శాపగ్రస్తురాలివి. నన్ను ప్రాధేయపడి ఏం లాభం?" అంటూ అసహనంతో నిట్టుర్పులొదిలాడు.

ఆ ప్రేమికుడి మాటలకు చినుకుకు దుఃఖం తన్నుకువచ్చింది. చినుకు చినుకే కన్నీరుగా మారింది. స్తంభించిన పిల్లకాలువ సవ్వడిచేస్తూ ఉరకలేస్తోంది. పైరగాలి వేగంగా పరుగులు తీస్తోంది. నీడ కూడా సూర్యుడి చలనానికి వ్యతిరేకంగా కదులుతోంది. చినుకును భరిస్తున్న ఆకు గాలికి కదలాడుతోంది. ఎండ చిన్నగా ఆ చినుకును తాకే ప్రయత్నం చేయసాగింది. చినుకెక్కడ ఆవిరవుతుందోనని ప్రేమికుడు వెంటనే ఆ ఆకును తన చేతిలో బంధించాడు.

"మిత్రమా! నువ్వు బాధలో ఉన్నా సరే, నన్ను ఎండనుండి రక్షించావు. నీ దుఃఖానికి కారణమేమిటి? అసలు నీ ప్రేయసి ఎందుకు దూరమైంది? నాతో చెప్పవా?" అని అడిగింది.

" పిచ్చి చినుకా! తెలుసుకుని నువ్వేం చేయగలవు? సరే, చెబుతాను విను. నా గుండెలో భారం కొద్దిగైనా తగ్గుతుందేమో! " అంటూ చెప్పసాగాడు.

★★★

"తను మా రాజ్యానికి యువరాణి. అంతఃపురంలో ఆమెను నిద్రలేపడానికి, ఉదయాన్నే పక్షులన్నీ చేరి సుప్రభాత గీతాలాపన చేసేవి. వేకువ తొలి కిరణాలు ఆమెను స్పృశించాలన్న ఆత్రుతతో వేగంగా దూసుకొచ్చి సున్నితంగా తాకేవి. చల్లటి పొగమంచు తెరలుతెరలుగా అంతఃపురాన్ని అలుముకొని, ఆమె శ్వాసగా మారేది.

ఆమె మేనికి సహజంగానే ఒక పరిమళం ఉంటుంది. ఆ పరిమళానికి సుగంధ వృక్షాలు మొహం మాడ్చుకునేవి. సుమాలు కుడా చిన్నబోయేవి.

ఆమె పూల వనాల్లో అలా నడుచుకుంటూ వెళ్ళేటపుడు, ఎన్ని గులాబీలు విచ్చుకునే ప్రయత్నం చేశాయో! ఆమె సోయగాలు చూడటానికి. ఎన్ని ముద్దబంతులు విరగకాసి ఎదురుచుశాయో! ఆమె ముద్దుకోసం.

ఉద్యానవనంలో సుమాలన్ని ఆమె స్పర్శకై కాచుకొనికూర్చుంటే, ఆమె మాత్రం తనకిష్టమైన తామరపుష్పాల కోసం కొలను వైపుగా సాగేది. దూరంనుండి ఆ పద్మాలను చూడటమే తప్ప ఏనాడూ వాటి చెంతచేరి ముద్దాడిందిలేదు.

ఒక యువరాణిగా ఆమెకు ఎటువంటి ఆంక్షలున్నాయో ఆ రాజ్యానికి సేనాధిపతిగా నాకు తెలుసు. ఒక మనసున్న మనిషిగా ఆమె సంతోషాన్ని దూరంచేయకూడదని కూడా తెలుసు. అందుకే రోజుకో పద్మంతో ఆమెకు శుభోదయం పలికేవాడిని. ఎవరికీ తెలియకుండా, ఎన్నో సాయంత్రాలు పద్మాలతో నిండిన కొలనుల్ని ఆమెకు బహుమతిగా ఇచ్చేవాడిని. ఆమె మురిసిపోతుంటే, ఆ చిరునవ్వులు చూసి నా హృదయంలో ఆనందం తాండవమాడేది. ఆ క్రమంలో నా హృదయాన్ని ఆమెకు ఎప్పుడు అర్పించానో తెలియదు. తనూ నన్ను ప్రేమించేది. ఆ విషయం నాతో చెప్పకపోయినా, ఆమె ప్రవర్తన ప్రస్ఫుటంగా ప్రతిబింబించేది. అంతలోనే ఈ విషయం మహారాజుగారికి ఎలా తెలిసిందో ఏమో! నన్ను బందీగా మార్చడం, కారాగారానికి తరలించడం వెంటనే జరిగిపోయాయి.

అదే అదునుగా భావించి పక్క దేశపు రాజు మా రాజ్యాన్ని ఆక్రమించేశాడు. ఆ విషయం కారాగారంలో ఉన్న నాకు రెండు రోజుల తర్వాతగానీ తెలియలేదు. ఎంతో కష్టంతో అక్కడినుండి బయటపడి, అంతఃపురానికి వెళ్ళాను. మహారాజుతో సహా సైన్యమంతా శవాలుగా పడిఉన్నాయి. యువరాణి ఆచూకి అసలేలేదు. రాజ్యమంతా పరాయి రాజు ఆధీనంలో ఉంది. ఎన్ని మారువేషాలు వేశానో నా ప్రేయసి జాడ కోసం. ఎన్నో యుద్ధాలను జయించి రాజ్యాన్ని కాపాడిన నేను. ఈ సారి అటు రాజ్యాన్ని, ఇటు నా ప్రేమను, దీన్నీ కాపాడుకోలేకపోయాను.... " అని చెబుతూవుండగానే గాలికి ఆ ఆకు ఎగురుకుంటూ పిల్లకాలువలో పడింది.

"ప్రేమికా! నీ ప్రేమను నేను గెలిపిస్తాను...." అంటూ ఆ చినుకు అరుస్తూ కొట్టుకునిపోయింది.

"కొమ్మల చాటున, పూరేమ్మల మాటున...

కోనలలోన, కొలనులలోన... ఎక్కడ ఉన్నా వెతికేస్తా!

చినుకు తలిస్తే ఏమవుతుందో లోకానికి నే చూపిస్తా!

పత్రంపై సవారీ చేస్తూ పవిత్ర ప్రేమను గెలిపిస్తా! "

అంటూ ఆ చినుకు నీళ్ళపైనుండి వెళ్తూ అంతటా గాలిస్తోంది.

ఎన్ని పాయలు చీలిందో! ఆ పిల్లకాలువ. అలసిపోయి పత్రంపై కునుకు తీస్తున్న ఆ చినుకును ఒక కొలనులోకి తీసుకెళ్ళింది.

ఆవలిస్తూ ఆ చినుకు మెల్లగా కళ్ళు తెరిచింది.

ఆ కొలనంతా పద్మాలతో నిండిపోయి ఉంది. ఇంకా చంద్రుడు వెళ్ళిపోకుండా ఎందుకో కాచుకొనిఉన్నాడు. ఆ వేకువన, చంద్రుడి కిరణాలకు కొలనంతా వెండిసముద్రమై మిలమిలా మెరుస్తోంది. ఎగురుతున్న సీతాకోకచిలుకలలోంచి తరంగాలను వస్త్రంగా చుట్టుకొన్న శ్వేత పద్మంలా ఒక యువతి ఎర్రటి పద్మాన్ని విరహంతో ముద్దాడుతోంది. మనసులో ఏదో వేదన ఉన్నట్లు అసహనంగా, అమాయకంగా కనిపిస్తోంది.

“అబ్బా! ఎంత సౌందర్యంగా ఉందో ఈమె! అచ్చం దేవతలా ఉంది. బహుశా ఈమే అనుకుంటా ఆ యువరాణి. ఇంక ఆలస్యం చేయకుండా వీళ్ళిద్దర్నీ వెంటనే కలిపేయాలి. ఎలా? నావల్ల అవుతుందా?...” అనుకుంటూ దీర్ఘాలోచనలో పడింది.

కొద్దిసేపటి తరువాత తెల్లారింది. యువరాణి మాత్రం ఒకచోట కూర్చొని పద్మాన్ని సుతారంగా నిమురుతూ ప్రియుడి ఆలోచనల్లో ఉంది. కళ్ళవెంట నీరు ధారగా కారుతున్నాయామెకు.

“ఇక నేను ఉపేక్షించకూడదు. నా ప్రాణాన్ని పణంగా పెట్టయినా సరే ఈ ప్రేమను గెలిపించాలి ” అనుకుంటూ సుర్యకిరణాల వైపుగా ఆకుని నడిపించిందా చినుకు. కిరణాల తాకిడికి ఆ చినుకు కొద్దిసేపటికే ఆవిరిగా మారి మేఘంలో కలిసిపోయింది. ఆలస్యం చేయకుండా మేఘాన్ని వదిలి ఆ ప్రియుడి పైనే మళ్ళీ వర్షించింది. ప్రేయసి జాడను చెప్పి, వారి ప్రేమకు ప్రాణం పోసింది.

ఇప్పటిదాకా ఎన్నో ప్రేమకథలను చుసిన నాకు, ఇదో గొప్ప అందమైన ప్రేమకథలా అనిపించింది. ప్రాణాలను త్యజించి వాళ్ళ ప్రేమను గెలిపించిన ఆ ప్రేమ చినుకుకు నా సలాం! ఇంతకీ నేనెవరో చెప్పలేదు కదూ... మిమ్మల్నందరినీ అనుక్షణం గమనించే అంతులేని ఆకాశాన్ని.

★

## రచయిత వివరాలు




వినోద్ కుమార్

ప్రభుత్వ ఉద్యోగం (వాణిజ్య పన్నులశాఖ)

రాయచోటి, కడప జిల్లా



For Latest Telugu Books - Visit now:

Kinige.com